# పునర్వసంతం

శ్రీ "భగవత్కుమార"

"రఘూ! ఇల్లారా!" అంటూ కేక వేసింది సుజాత.

"ఏమిటక్కా" అంటూ వచ్చాడు రఘు.

"పుస్తకాలు తెచ్చుకో పాఠం చెపుతాను."

రఘు పుస్తకాలు తెచ్చుకున్నాడు తమ్ముణ్ణి దగ్గర కూర్చోబెట్టుకొని పాఠం చెపుతోంది. అయితే రఘు మనస్సు పాఠంపై లేదు. నిద్రతూలి వస్తూండటం చేత కునికిపాట్లు పడుతున్నాడు. ఐతే సుజాత మనస్సు కూడా సరిగ్గా లేదు. మనస్సు గతించిన సంఘటనల్లోకి పురకలు వేస్తూంది. గతస్మృతులను నెమరు వేసుకోకుండా వుందామని ఎంత ప్రయత్నించినా మనసు మాత్రం దాగని అగాధాల్లోకి పరుగులిడుతూ విపరీతమయిన దుఃఖానికి గురిచేస్తూంది. దుఃఖాన్ని అరికట్టటానికి ప్రయత్నించీ విఫలురాలయింది. అంతటితో తమ్ముడి పాఠం కట్టిపెట్టింది. ఆ బయట వెన్నెలలో మంచం మీద పడుకుంది. ఎంత ప్రయత్నించినా కన్నీళ్లను అరికట్టలేకపోయింది.

సుజాత రఘులు కృష్ణమూర్తిగారి సంతానం. ఆయనది ఏమంత కలిగిన కుటుంబం కాదు. భార్య సుందరమ్మ సుస్వభావం కలది. వాళ్లకు మొట్టమొదటగా సుజాత కలిగింది. ఆ తరువాత చాలా కాలానికి రఘు పుట్టేడు. సుజాత పెద్దమనిషియైన దగ్గర్నుంచీ కృష్ణమూర్తికి కాలాగటం లేదు. ఇక సుందరమ్మ ఆదుర్దా చెప్పనవసరం లేదు. వెనకటికి ఒక సామెత వుంది - ఏడు జోళ్లు అరిగితేనే కాని ఒక మనువు కుదరటం కష్టమని. అందులోనూ మధ్య తరగతి కుటుంబీకునికి అందుబాటులో వుండే సంబంధం కుదరటం కష్టమైన పని. ఎలాగో తిరిగి తిరిగి ఒక సంబంధం ఖాయమనుకొని వచ్చాడు కృష్ణమూర్తి.

వరుడు రామారావు. బి. ఏ. చదువుతున్నాడు బరువుకట్నమయినా విధిలేక ఒప్పుకున్నాడు. పరిస్థితులన్నీ సవ్యంగా వుండటంవల్ల నిరాటంకంగా పెండ్లి జరిగింది. అయితే పెండ్లిలోనే కార్యం కూడా చేసి బరువు వదిలించుకుందామని అనుకుంది సుందరమ్మ. కాని రామారావు బి. ఏ. పరీక్ష అయిందాకా కార్యం చేసుకోనని పట్టుపట్టటంవల్ల ఎవరూ ఏమీ అనలేకపోయారు. పరీక్ష అయిపోగానే ముహూర్తం ఏర్పాటు చేసుకున్నారు. కాని పెండ్లికొడుకు ఎందుకో ఆనాడు రాలేదు. అందరూ ఆశ్చర్యపోయారు. ఇంతలో పిడుగులా టెలిగ్రాం వచ్చిపడింది. రామారావు రిక్షాలో స్టేషనుకు వెడుతూండగా ఒక లారీ గుద్దుకుని ఆ యాక్సిడెంటులో మరణించాడని. భయంకరమయిన యీ టెలిగ్రాంతో కళకళలాడే ఇల్లంతా కళావిహీనమయింది. ఏడుపులూ, పెడబొబ్బలూ ప్రారంభమయినయ్. "అయ్యో! నా తల్లీ! నీకిదేం రాతే" అని సుందరమ్మ కూతుర్ని కౌగలించుకొని గుండెలు పగిలేలా ఏడ్చింది. చిన్నతనంలోనే ఇంకా నిండా పద్ధెనిమిది సంవత్సరాలయినా నిండని కూతురికి ప్రాప్తించిన వైధవ్యాన్ని తలచుకుని రోదించాడు కృష్ణమూర్తి. ఇక సుజాత సంతాపం చెప్పశక్యం కాదు. గంపెడు దుఃఖంతో కూలబడింది. ఆశించిన తీయని ఘడియలు, అనుభవించబోయే అమరసౌఖ్యమూ, అన్నీ తృటిలో కలలుగా మారిపోయినయ్. మధువును గ్రోలబోయే మధుపం నోటిలో మన్నుపడింది. సుజాత భవిష్యత్తు అంతా చీకటిగా మారిపోయింది. చివరకు ఆమెకు మిగిలింది గంపెడు దుఃఖం, కడివెడు కన్నీళ్లూనూ - ఆనాటినుంచే సుజాత జీవితం అంధకారంలో అడుగుపెట్టింది. క్షణక్షణానికీ

కన్నీళ్ళతో కుమిలిపోయేది. బ్రతికినన్నాళ్లూ యిలా కన్నీటి సౌఖ్యమేనా అని కుమిలిపోయేది. కాని సుజాత అలాయని వూరుకోలేదు. తానూ స్కూల్ ఫైనలు ప్యాసయింది. అందుకని ప్రయత్నించి స్వస్థలంలోనే ఒక ఆఫీసులో క్లర్కుగా జేరింది. ఇల్లా అని లోకులు కాకులయి కూయకపోలేదు. సుజాత చదువుకున్నది కాబట్టి అన్నిటినీ తృణీకరించింది. ఎవరయినా అమ్మలక్కలు మాటవరుసకు అన్నా, ఘాటుగా మందలించేది. ఇల్లాంటి సమయంలో కూతురు సుజాత సంపాదన చాలవరకు కుటుంబసహాయానికి అడ్డుపడింది. తన భవిష్యత్తు ఎలా అయిపోయినా రఘుకు పెద్ద చదువు చెప్పించవలెనని అనుకుంది. ఐతే సుందరమ్మ కూతురి భవిష్యత్తును గురించి ఎప్పుడూ ఆలోచించేది. ఆ మనోవ్యాధే ముదిరి చివరికి కన్నీళ్ళతో ఇహలోకం వీడింది- ఇది గోరుచుట్టుపై రోకలి పోటయింది కుటుంబానికి. అన్ని పనులూ సుజాతపైపడినయ్.

సుజాత గతస్మృతులలోనుండి బయటకు వచ్చేసరికి కన్నీళ్ళతో దిండు ముద్దయిపోయింది. చల్లని వెన్నెల, ప్రశాంతమయిన పూర్ణిమచంద్రుడూ, చల్లని గాలీ ఆమె వూహల్ని రెచ్చగొడుతున్నయ్.

సుజాత ఆఫీసులో పనిజేస్తున్నా ఎవరితోనూ మాట్లాడదు. అనుక్షణం ఆమె ముఖంలో విచారం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. నవ్వుతూ ఎవరితోనూ మాట్లాడి ఎరుగదు. కొందరు ఆమెకు గర్వం అన్నారు. ఇంకా కొంతమంది పెంకిమనిషి అన్నారు. ఎవరేమన్నా ఏమీలక్ష్యపెట్టేది కాదు.

కాని ఆయాఫీసులో పనిచేసే మోహన్‌కు మాత్రం ఆమె ప్రవర్తనకు బలమయిన కారణం ఒకటి వుండితీరవలెననుకున్నాడు. ఎందుకు ఎప్పుడూ అలా విచారంగా వుంటుందో తెలుసుకోవలెనని ఎంత ప్రయత్నించినా అంతుపట్టలేదు. ఆమెనే అడిగి తెలుసుకోవలెననుకున్నాడు. అయితే సమయం చిక్కలేదు.

ఒకనాడు మోహన్ పార్కులో కూర్చున్నాడు ఏదో ఆలోచిస్తూ. ఇంతలో సుజాతకూడా పార్కులోకివచ్చి ఒక బెంచిమీద కూలబడింది శూన్యంలోకి జూస్తూ. మోహన్ ఆమెనుజూసి దగ్గరగావచ్చి "సుజాత గారూ!" అని పలుకరించాడు. ఆమె అదిరిపడింది. కాని వెంటనే అతన్నిచూసి "ఏమిటండీ!" అన్నది. "మిమ్మల్ని ఒక విషయం అడుగవలెననుకుంటున్నాను. అపార్థంజేసుకోకపోతే ..." అన్నాడు. "సగౌరవమయిన విషయాన్ని ఎప్పుడూ అపార్థంజేసుకోను" అంది.

"మిమ్మల్ని ఎప్పుడుచూసినా ఏదో విచారంగా కనపడతారు. అందుకు కారణమేమిటో తెలుసుకోవచ్చా?"

ఆమె ఒక వేడినిట్టూర్పు విడిచింది. పేలవంగా పొడినవ్వు నవ్వింది. "నా జీవితాన్ని గురించి తెలుసుకోవాలెనని మీ కెందుకింతశ్రమ?" అంది.

"తోటివారి కష్టసుఖాలు తెలుసుకోవటం తప్పు కాదుగా" అన్నాడు.

"నా దంతా ఒక విషాదగాథ." అని క్రితం జరిగిన విషయాలన్నీ పూసగ్రుచ్చినట్లు చెప్పింది. మోహన్ కళ్ళవెంట అప్రయత్నంగా భాష్పాలు రాలినయ్.

"అంతా అయిపోయింది నా బ్రతుకు అడివిగాచిన వెన్నెల అయిపోయింది. ఏదో జీవిస్తున్నా. మోడువారిన చెట్టులా"- అంది గద్గదికంగా.

"నిండా ఇరవై అయినా వెళ్ళని యీ లేత వయస్సులో మీకు యీ దుర్భరవైరాగ్యజీవితమా?" అన్నాడు.

"కాక ఏముంది? కదిలినా మెదిలినా సంఘం కన్నుమూని లేనిపోని అపవాదులు అంటగడుతుంది. గౌరవంగా జీవించటానికి యీ కుళ్ళు సంఘంలో నా బోటి వితంతువులకు స్థానంలేదు. ఇంతే నా బ్రతుకు యిలా జీవితపర్యంతం తెల్లవారిపోవలసిందే -" అంది. ఆమె కంఠంలో ఎంత దుఃఖం మిళితమైవుందో, ఎన్ని కోర్కెలు అణగారిపోయి

నయో. అప్పటికి బాగా చీకటిపడింది. పార్కులో జనం దాదాపు సన్నగిల్లారు రేడియో మాత్రం వదలకుండా గీపెడుతూంది. మోహన్ ఏదో ఆలోచిస్తున్నాడు.

"మీకు అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని వివాహమాడతాను." అన్నాడు.

సుజాత వులిక్కిపడింది. పలచని పెదవులపై పేలవంగానవ్వి - "నా జీవితాన్ని పరీక్ష చేస్తున్నారా" అంది.

"లేదు. నా జీవితాన్ని పరిశీలించుకునే యీ విషయం మీ ముందు పెట్టాను - " అన్నాడు.

"మోహన్ గారూ! యిదంతా ఒట్టిభ్రమ. ఇలా చేస్తే సంఘం మనమీద విరుచుకుపడదూ - " అంది.

"అదే పొరపాటు అంటాను - ఈ సంఘానికి కళ్లువుండి నిజాన్ని చూడలేదు - నేను సమాజాన్ని లెక్కచేయను. ఎప్పుడో ఆ హద్దులు దాటిపోయాను. మనం సమాజాన్ని వ్యతిరేకించినా చేసేది తప్పుపనికాదుగా. జీవితకాలం ఏడుస్తూ జీవించటం సంఘానికి బాగుంటుందా? అనుభవించటం, ఆనందించటం వ్యక్తికిచ్చిన స్వాతంత్రం. సంఘసంస్కర్తలు వెలుగుబాటలోకి అడుగుపెట్టాలి. అప్పుడే భవిష్యత్తుకుదారి - " అన్నాడు.

"అలా అయితే నా జీవితంలో మళ్లీ వసంతం తొలకరించింది మోహన్. మా నాన్నను ఒప్పించటమంత కష్టమైనపనికాదు మోహన్ - " అంది.

ఐతే సుజాత యీ విషయాన్ని చెప్పేందుకు కొంచెం వెనుకముందాడింది. పాతకాలపు తండ్రి యీ విషయానికి అనుమతిస్తాడా అని సంశయించింది. ఐతే మోహన్ యీ విషయములో ముందంజ వేశాడు. ఒకనాటి సాయంత్రం యీ విషయం కృష్ణమూర్తికి బయటపెట్టాడు.

ఆయన మొదట ఆశ్చర్యపోయాడు. తరువాత కూతురు భవిష్యత్తును నెమరు వేసుకుని తమాయించసాగాడు. చివరకు "సమాజాన్ని ఎదిరించి ముందుకుపోవటం కష్టమైనపని. ఇప్పటికే లోకపు కాకిగోల భరించలేకున్నాను." అన్నాడు బాధగా.

"అన్నీ తెలిసిన మీరుకూడా యిలా మాట్లాడితే ఎలా చెప్పండి. ఆ దుష్టసంఘపు అడ్డుగోడలను అధిగమించి ముందుకుపోవాలి. నీతిఅయినమాటకే మనం విలువయిస్తాముకాని అవినీతికి స్థానం ఇవ్వముగా. జీవితంలో నవ్వుతూ వుండాలి. అంతే కాని ఒకరికిదడిసి ఎంతకాలం ఒదిగివుంటాము - " అన్నాడు,

"మోహన్ నీవు సంఘ సంస్కారానికి మణిపూసవి" అన్నాడు కృష్ణమూర్తి ఆనందంతో

"అమ్మా సుజా ఇలా రా!" అని కూతుర్ని పిలిచాడు.

సుజాతవచ్చింది. "నా తల్లి జీవితం ఇహ ఎప్పుడూ దుఃఖమిళితమే అనుకున్నాను. నీ జీవిత అంధకారంలో జ్యోతి వెలిగించాడమ్మా మోహన్. నా తల్లికి చల్లని రోజులు రావటమేగా నాకూ కావలసింది. కలకాలం నీ విలా వాడిపోయిన పూవులా జీవించటం నాకు మాత్రం శూలం పొడిచినట్లు వుంటుంది తల్లీ! తిరిగి నీవు ఒక యింటిదానివయ్యావు నాకదే పదివేలు తల్లీ! ఏదీ కుంకుమపెట్టుకొని రామ్మా!" అన్నాడు.

సుజాత క్రొత్తచీర కట్టుకొని బొట్టుపెట్టుకొని కళకళలాడుతూ తండ్రి దగ్గరకు వచ్చింది. "నా తల్లిని మళ్ళీ యిలా చూడగలిగాను. నీ జీవితంలో పునర్వసంతం తొలకరించాడు మోహన్!" అని ఆనంద భాష్పాలుగారుస్తూ కూతురు చేతిని మోహన్ చేతిలోవుంచి "కలకాలం సుఖంగా వుండండి!" అని దీవించాడు ఆ దంపతులను.

మోహన్ భార్యవైపుచూసి చిరునవ్వు నవ్వాడు. క్రొత్త పెళ్ళికూతురిలా సుజాత సిగ్గుపడింది. ఆనూతన దంపతుల మధుర జీవనంలో సంఘపుగోడలు నిలువలేక పునాదులతో కూలిపోయినయ్.

—౦—